ఈనాడు మంచిర్యాల

శుక్రవారం అక్టోబరు 4, 2024


ఎస్టీపీపీకి జాతీయ స్థాయి పురస్కారాలు



నిర్వాహకుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సంచాలకుడు సత్యనారాయణ రావు

జైపూర్, న్యూస్‌టుడే : జైపూర్ మండలం పెగడపల్లి గ్రామంలోని సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రానికి జాతీయ స్థాయిలో మరో రెండు పురస్కారాలు దక్కాయి. దిల్లీ వేదికగా ఈ నెల 1న సీఈఈ (కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్సలెన్సీ) ఆధ్వర్యంలో 2వ జాతీయ పవర్ జనరేషన్ లీడర్‌షిప్ అవార్డు-2024 ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 500 మెగావాట్ల పైబడి విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్రభుత్వ రంగ సంస్థలో ఉత్తమ ఉత్పత్తి సాధించినందుకు ఎస్టీపీపీకి, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన సంచాలకుడు డీ.సత్యనారాయణ రావుకు లీడర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. ఎస్టీపీపీకి వరుసగా రెండు అవార్డులు రావడం పట్ల సీఎండీ బలరాంనాయక్, ఎస్టీపీపీ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు.

దేవీ ఆగమనం.. నవరాత్రులు ప్రారంభం



జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డులో కొలువుదీరిన అమ్మవారు

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విజయదశమి సందర్భంగా జగన్మాత నవరాత్రుల వేడుకలు గురువారం ఘనంగా ఆరంభమయ్యాయి. డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారిని శోభాయాత్ర ద్వారా తీసుకొచ్చి ఆయా మండపాల్లో ప్రతిష్ఠించారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

4 రోజులు చుట్టేద్దాం.. నచ్చిన చోటు చూసేద్దాం!

- ఉమ్మడి జిల్లాపై అవగాహన పెంచుకునేందుకు మంచి తరుణం

దండేపల్లి, న్యూస్‌టుడే

మూడు నెలల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు దసరా సెలవులొచ్చాయి. సెలవులంటేచాలు అందరికీ సంబరమే. కొత్త ప్రదేశాల్లో ఆనందంగా గడుపుతూనే మరో వైపు మనకు దగ్గరలోని చారిత్రాత్మక ప్రాంతాలు, దేవాలయాలను ఓసారి చుట్టి వస్తే అనుభవాలు, జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి. ఓ నాలుగు రోజుల్లో పిల్లలు చూసే ఎన్నో విశేషాలు.. వివిధ ప్రదేశాలతో ఆయా ప్రాంతాలపై అవగాహన పెంచుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొత్త జిల్లాల వారీగా ఇక్కడి ప్రాంతాల విశిష్టతను తెలుసుకునే అవకాశముంది.

నిర్మల్ జిల్లాలో...



నిర్మల్ ఖ్యాతిని తెలిపే కొయ్యబొమ్మలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో తయారయ్యే కొయ్యబొమ్మలు చూడాల్సిందే. తేలికపాటి పొనికి కర్రతో 400 ఏళ్ల నుంచి తయారు చేస్తున్న ఈ బొమ్మలు సజీవంగా మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.
- ఇక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ జలాశయాన్ని చూసిరావచ్చు..

కడెం.. అందాల కనువిందు



కడెం మండల కేంద్రంలో వాగుపై నిర్మించిన జలాశయం నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తురాబాద్‌తో పాటు మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగు నీరందిస్తున్న తీరును, విశేషాలు తెలుసుకోవచ్చు. బోటు ద్వారా జలాశయం అందాలను తిలకించవచ్చు.

బాసర సరస్వతి క్షేత్రం..






చదువుల తల్లి సరస్వతి అమ్మవారు ముథోల్ మండలంలోని బాసరలో కొలువై ఉంది.. గోదావరి నదీ తీరంలో ఉన్న దేవాలయాన్ని దర్శించుకోవడంతో పాటు, అక్షరాభ్యాసం చేయించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారు.
- నిర్మల్ నుంచి బాసర వెళ్లే మార్గంలో కదిలి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు..

ఆదిలాబాద్ జిల్లాలో

1200 ఏళ్ల నాటి సూర్యదేవాలయం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానాన్ని 122 ఏళ్ల కిందట జైనులు నిర్మించారు. ఏటా రెండు సార్లు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను స్పృశిస్తుండటం దీని ప్రత్యేకత. ఆదిలాబాద్ నుంచి 30 కి.మీ. దూరంలో ఉంటుంది.

అనుభూతిని పంచే పొచ్చెర..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది. ఎత్తైన ప్రదేశం నుంచి నీరు కిందికి జాలువారుతాయి. దీన్ని వీక్షించడం గొప్ప అనుభూతిగా చెప్పుకోవచ్చు. బోథ్ జాతీయ రహదారి ఎక్స్ రోడ్ నుంచి ఆరు కి.మీ. దూరంలో ఉంది.

పర్యాటకుల సందడి.. కుంటాల జలపాతం..



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతాన్ని చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది నిత్యం వస్తుంటారు. చుట్టూ దట్టమైన అడవిలో ఉన్నందున అటవీమార్గం గుండా జలపాతానికి చేరుకోవడం ఓ అనుభూతి. కుంటాల నుంచి 12 కి.మీ. ఉంది.



కుమురంభీం జిల్లాలో...

కుమురంభీం స్మారక మ్యూజియం



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ వద్ద నిర్మించిన కుమురంభీం స్మారక మ్యూజియం ఎంతో ప్రసిద్ధమైంది. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాంలతో పోరాడి జీవితాన్నే త్యాగం చేసిన కుమురంభీం జీవిత విశేషాలను తెలిపే మ్యూజియం ఇది. దీనికి దగ్గరలో ఉన్న కెరమెరి ఘాట్ రహదారి కూడా వీక్షించవచ్చు.



మంచిర్యాల జిల్లాలో...

సింగరేణి.. సిరుల వేణి




మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 10 కి.మీ. నుంచి 30కిలోమీటర్ల దూరంలోనే శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, ఇందారం, మందమర్రి, బెల్లంపల్లి గనులున్నాయి.. ఇందులో భూగర్భ గనులతో పాటు ఉపరితల గనులున్నాయి. బొగ్గు తీయడం దగ్గర నుంచి రవాణా చేసే వరకు వివిధ దశలు, కార్మికుల శ్రమను తెలుసుకోవచ్చు..

ఎల్లంపల్లి జలాశయం..



గోదావరి నదిపై హాజీపూర్ మండలం ఎల్లంపల్లి సమీపంలో నిర్మించిన జలాశయాన్ని చూడొచ్చు. ఇది మంచిర్యాల, లక్సెట్టిపేట మధ్యలో ఉంటుంది. సాగు నీటితో పాటు హైదరాబాద్ వరకు తాగు నీరందించే ప్రక్రియను వీక్షించవచ్చు.

సత్యదేవుని నిలయం..గూడెం



తెలంగాణలో ఉన్న ఏకైక సత్యదేవుని ఆలయం దండేపల్లి మండలం గూడెం సమీపంలో గోదావరి తీరంలో ఉంది. జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన ఈదేవాలయం పక్కనే అయ్యప్ప ఆలయం, సాయి బాబా ఆలయాలు ఉన్నాయి...గోదావరి తీరంలో ఎల్లంపల్లి నుంచి నీరందించే గూడెం ఎత్తిపోతల పథకం ఉంది..
- ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో చర్చిగా ప్రసిద్ధి చెందిన సీఎస్ఐ చర్చి లక్సెట్టిపేటలోని ఉంది..
- మంచిర్యాల జిల్లాలోని జన్నారం నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యాన్ని తిలకించవచ్చు. జన్నారం మండల కేంద్రంలోని జింకల సంరక్షణ కేంద్రం, మ్యూజియంను సందర్శించవచ్చు. ఇక్కడ నుంచి సఫారీ వాహనంలో లోపల ఉన్న అడవిని చుట్టి రావచ్చు.



ఆక్రమిత స్థలాలను కూల్చివేస్తున్న యంత్రాలు

ఆక్రమిత మున్సిపల్ స్థలాల కూల్చివేత

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రధాన మార్కెట్‌లో ఆక్రమిత మున్సిపల్ స్థలాల భవనాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝళిపించారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే భారీ యంత్రాలతో భవనాలను కూల్చివేశారు. దీంతో ఉదయం కాసేపు వ్యాపారస్థులు, మున్సిపల్ అధికారుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. బుధవారం రాత్రి 11 గంటల తర్వాత మార్కింగ్ ఇవ్వడం, ముందస్తు నోటీసులు ఇవ్వలేదని వ్యాపారస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండగ రోజుల్లో వ్యాపారాలకు ఇబ్బందిగా కూల్చివేతలు సరికాదని, తమకు కొంత సమయం ఇవ్వాలని కోరారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

సమాచార నిర్ధారణ.. కొత్త కార్డుకు సిఫారసు

- జిల్లాలో ప్రారంభమైన కుటుంబ డిజిటల్ కార్డు సర్వే

చెన్నూరు గ్రామీణం, మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం కుటుంబ డిజిటల్ కార్డులను కుటుంబాలకు కేటాయించేందుకు నిర్ణయించి క్షేత్రస్థాయిలో సర్వేను ప్రారంభించింది. ప్రతి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన రెండు ప్రాంతాల్లో(పట్టణ, గ్రామీణ) గురువారం నుంచి సర్వే ప్రారంభించారు. జిల్లాలోని చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోమూడు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పురపాలిక, పంచాయతీ అధికారులతో సర్వే నిర్వహిస్తున్నారు.

ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు

సర్కారు అందిస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు రకరకాల గుర్తింపుకార్డులు ఉన్నాయి. రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ, పింఛన్, తదతర కార్డులన్నింటిని కలిసి డిజిటల్‌కార్డు జారీ చేసేందుకు నిర్ణయించి సర్వేను ప్రారంభించింది. ప్రతి నియోజకవర్గంలో ఎంపికచేసిన ఒక పట్టణం, గ్రామంలో అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాల ఆధారంగా సర్వేలో నమోదు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కుటుంబాలకు సంబంధించిన బేసిక్ డాటాలో ఉన్న వివరాలు నిర్ధారించుకుంటున్నారు. మృతి చెందిన వారిని తొలగించడంతో పాటు కొత్త వారిని నమోదు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో శాశ్వతంగా నివాసముంటున్న వారిని తొలగిస్తున్నారు. కుటుంబంలో వివాహమైన వారిని వారి అనుమతితోనే కొత్త కుటుంబ కార్డు కోసం నమోదు చేస్తున్నారు. కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు నమోదు చేసిన తదుపరి ప్రభుత్వం డిజిటల్ కార్డును జారీ చేయనుంది.

జిల్లాలో సర్వే చేస్తున్న ప్రాంతాలు

నియోజకవర్గం	పట్టణం	పంచాయతీ(మండలం)
చెన్నూరు	చెన్నూరు, 5వవార్డు	సంకారం (చెన్నూరు)
మంచిర్యాల	మంచిర్యాల, 16వార్డు	అల్లిపూర్, (దండేపల్లి)
బెల్లంపల్లి	బెల్లంపల్లి, 16వార్డు	లంబడితాండ-కే(కాసిపేట)

ఉపయోగాలివీ..



- సంక్షేమ పథకాలు, పాస్‌పోర్టు దరఖాస్తులకు చిరునామాగా డిజిటల్ కార్డులు ఉపయోగపడుతాయి.
- సంక్షేమ పథకాల దరఖాస్తుకు ఆధార్, పాన్, ఇతర కార్డులు లేకున్నా. డిజిటల్ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు.
- బ్యాంకు రుణాలు, సంక్షేమ పథకాలు తీసుకొని మరోసారి దరఖాస్తు చేస్తే కార్డులో తెలుస్తుంది.
- ఇంటిపన్నులు, ట్రాఫిక్ చలానాలు, విద్యుత్తు బిల్లులు చెల్లింపులు చేసుకునే అవకాశం ఉంటుంది.
- ఆరోగ్య వివరాలు నమోదుతో వైద్య,ఆరోగ్యశాఖ హెల్త్ ప్రొఫైల్‌ను పర్యవేక్షించనుంది.



చెన్నూరు పురపాలికలోని 5వ వార్డులో సర్వే చేస్తున్న పురపాలిక అధికారులు

నోడల్ అధికారుల పర్యవేక్షణలో..

జిల్లాలో చేపట్టిన సర్వే నోడల్ అధికారుల పర్యవేక్షణలో సాగుతోంది. నియోజకవర్గానికి ఒక్కరి చొప్పున నోడల్ అధికారులను నియమించారు. చెన్నూరుకు జడ్పీ సీఈవో గణపతి, మంచిర్యాలకు ఆర్డీవో వి.రాములు, బెల్లంపల్లికి కె.హరికృష్ణ నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ సర్వే పరిశీలిస్తున్నారు. పురపాలిక, గ్రామాల్లో సర్వే చేస్తున్న బృందాలకు సర్వేపై తగిన సూచనలు, సలహాలు అందజేస్తున్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్ ఇతర అధికారులు

ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలో వరిధాన్యం కొనుగోళ్లకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కొనుగోళ్లపై చర్చించారు. కొనుగోలు కేంద్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్‌లు, మిల్లులకు కేటాయింపు, రైతులకు మద్దతు ధరల చెల్లింపుపై పలు సూచనలు చేశారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా అధికారులు కిషన్, బ్రహ్మారావు, శ్రీకళ, కల్పన, యాదయ్య, సంజీవరెడ్డి, షహాబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి సదరం శిబిరం

ఏసీసీ, న్యూస్‌టుడే : ఈ నెల 7 నుంచి 28 వరకు నిర్వహించే సదరం శిబిరాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన, రెన్యువల్ దివ్యాంగ ధ్రువీకరణ పత్రాల కోసం ముందుగా మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7, 18, 23, 28వ తేదీల్లో శారీరక దివ్యాంగులు, 16న మూగ చెవుడు, 22న మానసిక దివ్యాంగులు, 25న కంటిచూపు బాధితులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇది వరకే స్లాట్ బుక్ చేసుకున్నవారికి వెయిటింగ్ జాబితా ప్రకారం చరవాణులకు వచ్చిన సందేశాల ఆధారంగా ఆయా తేదీల్లో శిబిరానికి హాజరుకావాలన్నారు.

పక్కాగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కార్మల్ కాన్వెంట్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఎంపికైన జాబితాలో 1:3 ప్రకారం చేపడుతున్న అభ్యర్థుల విద్యార్హత, ఇతర పత్రాల పరిశీలనను ఆయన గమనించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవకతవకలు జరగకుండా ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సూచించారు. డీఈవో యాదయ్య, సూపరింటెండెంట్ సత్యనారాయణ, పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.


అక్కడ విధులంటే భయం

- జీజీహెచ్‌లోని ఓ విభాగం పరిస్థితి ఇది

జీజీహెచ్‌లోని ఓ విభాగంలో ఆ వైద్యుడు సీనియరే. శాశ్వత ఉద్యోగిగా మాత్రమే జూనియర్. ఓపీ విభాగంలో బాధితులను పరీక్షిస్తుంటే ఆ సీనియర్ నిపుణుడు మధ్యలో వచ్చి ఇలా కాదు అలా చేయాలని, ఈ మందు కాదు మరో మందు రాయాలంటూ చెబుతారు. బాధితుల కుటుంబసభ్యుల ముందే ఇష్టారీతిన ప్రవర్తిస్తూ చులకన చేస్తున్నారు. ఇలా ఒకటి, రెండుసార్లు కాదు.. నిత్యం ఇదే తంతు అంటూ వైద్యం అందించలేకపోతున్నానని ఓ వైద్యుడు ఆవేదన వెలిబుచ్చారు. ఈ స్థాయి ఇబ్బంది చదువుకునే సమయంలో కూడా ఎదురు కాలేదంటూ సెలవులో ఉన్నానని వాపోయారు.

ఈ విభాగంలోనే అనేక సంవత్సరాలు చేశారు. భవిష్యత్తులో బోధనాసుపత్రికి సంబంధించి తప్పనిసరి ధ్రువీకరణపత్రం అవసరముంటుందనే ఆలోచనతో జూనియర్‌గా చేరారు. పూర్తి పట్టు ఉన్నా ఆ సీనియర్ వైద్యుడు కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆ విభాగంలోని సిబ్బంది చికిత్సపై చరవాణిలో సంప్రదించినా ఎందుకు ఫోన్ చేశారంటూ భయపెడుతూ చరవాణులకు తీసుకునే స్థాయికి చేరారు. దీంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. సేవలకు సెలవు పెట్టీ మరి బోధనాసుపత్రి, కళాశాల పర్యవేక్షకులకు కలిసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఆ సీనియర్ వైద్యుడి నుంచి తీవ్ర ఒత్తిడి, విభాగంలో అనేక సమస్యలు, బాధితులకు అత్యవసరమైన మందుల కొరత ఈ స్థాయి ఇబ్బందుల మధ్య బాధితులకు న్యాయం చేయలేను. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టింపులేదు. ఈ విభాగాన్ని సరిచేసేందుకు ప్రయత్నించడం లేదు. బాధితుల ఇబ్బందులకు పరిష్కారం చూపించడం లేదు. ఈ విభాగం అస్తవ్యస్తంగా మారేందుకు కారణం ఎవరని తెలిసినా చర్యలు చేపట్టడం లేదు. తోటి సీనియర్ వైద్యుడిపై వేటు వేస్తే తమపై ఎలాంటి ఆరోపణలు చేస్తారోనని భయంతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది.



మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

మంచిర్యాల జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఓ సీనియర్ వైద్యుడి వైఖరి వైద్యులకు, బాధితులకు ఇబ్బందిగా మారింది. ఆయన నుంచి ఎదురవుతున్న ఒత్తిడి, సమస్యలతో ఆయా విభాగంలోని వైద్యులందరూ ఒక్కొక్కరిగా వైదొలగడం మొదలుపెట్టారు. ఇలా తాత్కాలిక వైద్యులు నలుగురు రాజీనామా చేసి వెళ్లగా.. మరో నలుగురు శాశ్వత వైద్యులు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. ప్రస్తుతం ఆ విభాగం ఏకాకిగా మారి బాధితులు అవస్థలు పడాల్సిన దుస్థితి.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు?

జీజీహెచ్‌లోని సీనియర్ వైద్యుడిపై పర్యవేక్షకులకు ఫిర్యాదు చేశారు. నేరుగా నేను ఎలాంటి చర్యలు తీసుకోలేనని, రాతపూర్వకంగా ఇస్తే ఉన్నతస్థాయికి పంపిస్తానని చేతులెత్తేశారు. కళాశాల నిర్వాహకులకు మొర పెట్టుకుందామంటే.. తనదాక తీసుకురావద్దని, ఎలాంటి ఫిర్యాదులు స్వీకరించలేనని చెప్పారు. మీ విభాగం మీరే చూసుకోవాలంటూ కనీసం వినతి పత్రం తీసుకునేందుకు ముందుకు రాలేదు. ఈ క్రమంలో ఆ విభాగంలోని వైద్యులందరూ ఒక్కొక్కరిగా వైదొలిగారు. మరికొందరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆయన ఉండగా విధులకు హాజరుకాలేమని, అవసరమైతే రాజీనామా కూడా చేస్తామంటూ సెలవుల్లో ఉన్న ఆయా నిపుణులు చెబుతుండటం గమనార్హం.

టోకెన్ల కోసం వెంపర్లాట



ఆదిలాబాద్ డైట్ కళాశాలకు ధ్రువపత్రాల పరిశీలన కోసం గురువారం భారీగా అభ్యర్థులు తరలివచ్చి కౌంటర్ల వద్ద గుమిగూడారు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ సమయంలో పాలనాధికారి రాజర్షిషాలోనికి వెళ్లేందుకు కొంత ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇది గమనించిన డీఈవో ప్రణీత అభ్యర్థులకు టోకెన్లు ఇవ్వాలని సిబ్బందిని పురమాయించారు. ఆ టోకెన్ల కోసం అభ్యర్థులు పరుగులు పెట్టి పోటీ పడాల్సి వచ్చింది.

- ఈనాడు - ఆదిలాబాద్, - న్యూస్‌టుడే- పాలనాప్రాంగణం

పచ్చందాల దారిలో.. ప్రకృతిని ఆస్వాదించేలా

సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు విస్తరించి ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పచ్చదనం పెద్దగా కనిపించదు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా పచ్చదనంతో కనువిందు చేస్తూ ఆహ్లాదం పంచుతోంది. శ్రీరాంపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు 363 జాతీయ రహదారి నిర్మించారు. మార్గమధ్యలోని బొక్కలగుట్ట వద్ద సుమారు 340 ఎకరాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో గాంధారి వనాన్ని అద్భుతంగా విస్తరించారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల విస్తీర్ణంలో అన్ని రకాల వేలాది చెట్లు కనువిందు చేస్తున్నాయి. అప్పటి వరకు పచ్చదనం కనిపించని చోదకులు, ప్రయాణికులకు ఒక్కసారిగా ప్రకృతి ఒడిలో నుంచి ప్రయాణిస్తుండటంతో సుమారు కిలోమీటర్ల మేర ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నిత్యం వందలాది మంది వ్యాయామం, యోగా, ధ్యానం చేసేందుకు వస్తుంటారు. ఇక్కడ గాంధారి మైసమ్మ ఆలయం ఉండటంతో నిత్యం భక్తులు వంటావార్పు చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పక్కనే ఉన్న గాంధారిఖిల్లా గుట్టలు కనువిందు చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం



జాతీయ రహదారికి ఇరువైపులా గాంధారి వనం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా అందించే పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం మంజూరైన, వినియోగించిన నిధులకు సంబంధించిన వివరాలను శాఖల వారీగా అధికారులు వివరించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతులకు అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేసేందుకు కలెక్టర్, విద్యాశాఖ అధికారులను అభినందించారు. జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషన్ ఛైర్మన్, సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేసిన డీఈవో రవీందర్‌రెడ్డిని కమిషన్ ఛైర్మన్, సభ్యులు సన్మానించారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు పాలనాధికారులు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిరునవ్వు నవ్వేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం: చిరునవ్వుతో మానసిక రుగ్మతలు దూరమవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. మానవ సంబంధాలు పెంపొందుతాయి. మనిషి మానసిక స్థితిని ఆహ్లాదకరంగా ఉంచుతుంది. అంతటి ఆరోగ్యాన్ని పెంపొందించే చిరునవ్వుకు ఓ రోజుంది.. అక్టోబరు 4న 'స్మైల్ డే' నిర్వహిస్తుంటారు.

మీకు తెలుసా?



అమెరికాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు హార్వే రాస్ బాల్ తొలిసారిగా స్మైలీ ఫేస్(నవ్వించే ముఖం) చిత్రాన్ని గీశారు.

అనేక ప్రశ్నలకు సమాధానం..

కొన్ని సందర్భాల్లో మన చిరునవ్వు అనేక ప్రశ్నలకు జవాబవుతుంది. ఇతరుల బాధను మాయం చేస్తుంది. దూరమైన వారిని దగ్గరకు చేర్చుతుంది. పిల్లలు తమ తల్లిదండ్రులను, పెద్దలను నవ్వుతో పలకరించాలి. పెద్దలు కూడా పిల్లలకు చిరునవ్వుతో సమాధానం చెప్పాలి. అప్పుడే ఆ ఇల్లు ఆనందమయ కోవెలగా మారుతుంది. చిరునవ్వుతో బయటకు వెళ్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అందుకే జనాలను నవ్వించేందుకు లాఫింగ్ క్లబ్‌లు, హాస్యభరిత చిత్రాలు, కామెడీ సినిమాలు, రియాలిటీ షోలు అందుబాటులో ఉంటున్నాయి.

సచిన్‌తో సచిన్..



ఒకరేమో మరాఠీ దిగ్గజ నటుడు సచిన్ పిల్గావకర్. మరొకరేమో క్రికెట్ దేవుడు సచిన్. ఓ పురస్కార ప్రదానోత్సవ వేదికపై ఇద్దరు కలుసుకున్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి మిమ్మల్ని చూస్తున్నా. అప్పటికీ, ఇప్పటికీ మీ ముఖం చిరునవ్వుతోనే కళకళలాడుతుందని టెండూల్కర్ అనడంతో వెంటనే మైక్ లాక్కొని మీరు కూడా చిరునవ్వుతోనే క్రికెట్ రంగంలో రికార్డులు నెలకొల్పారని పిల్గావకర్ చిరునవ్వుతోనే సమాధానమిచ్చారు. ఈ దృశ్యం వీక్షకులను సైతం ఆకట్టుకుంది.

ఆరోగ్యానికి మేలు



చిరునవ్వు అనేది మనిషి మానసిక స్థితిని తెలియజేస్తుంది. చిరునవ్వు అలవాటు ఉన్నవారి శరీరంలో నాడీ మండలాలు ఉత్తేజితమవుతాయి. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి, అలసట, గ్యాస్ట్రిక్, హైపర్‌టెన్షన్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మైగ్రెన్, కండరాల నొప్పుల నుంచి కోలుకోవచ్చు. సకరాత్మక హార్మోన్లు ఎండోర్ఫిన్, సెరటోనిన్ విడుదలై మానసికోల్లాస అనుభూతిని పొందుతారు. గుండె దడ నియంత్రణలో ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. - డా.ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

పరుగుల వర్షం కురిపించి..



భారత క్రికెటర్ అజయ్ జడేజాను ఎప్పుడు చూసినా చిరునవ్వుతోనే కనిపిస్తుంటారు. 1996లో జరిగిన ప్రపంచ క్రికెట్ కప్ క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్ బౌలర్లు వకార్ యూనుస్, అకిబ్ జావేద్, అతా-ఉర్-రెహ్మాన్ అజయ్ జడేజాను రెచ్చగొట్టారు. భయపెట్టేలా బాడీలెంగ్త్ బౌలింగ్ వేశారు. ఆయన ఏకాగ్రతను భంగం చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా జడేజా వారి కుయుక్తులకు లొంగకుండా చిరునవ్వుతోనే బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించారు. భారత్ భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు.

లాఫింగ్ క్లబ్..



మధుసింఘాల్ ఆదిలాబాద్‌లో మహిళల కోసం లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ద్వారకానగర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో రోజూ ఉదయం గంట పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. 50 మందికిపైగా మహిళలు ఈ క్లబ్‌లో చేరి యోగాభ్యాసం చేస్తున్నారు. ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంట్లో అందరు బాగుంటారని నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఉర్దూ నేర్చి.. ఉద్యోగం సాధించి!

● గిరిజన యువతి ఘనత



పవార్ మౌనిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఇంటి చుట్టూ ఉన్న ముస్లింలతో ఉర్దూ భాషలో మాట్లాడటం అలవాటు చేసుకున్న ఆ యువతికి ఆ భాషే చివరకు ఉద్యోగాన్ని సాధించిపెట్టింది. ఉట్నూరు మండలం లక్కారం మసీదు ఏరియాలో నివాసముండే న్యాయవాది పవార్ వసంత్‌రావు కూతురు పవార్ మౌనిక డీఎస్సీ ఉర్దూ మాధ్యమంలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో రెండు పోస్టులు రిజర్వు చేయడంతో ఆమెకు ఉద్యోగం దక్కడం లాంఛనమే. గురువారం డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు ఆ యువతి హాజరైంది. ఇంటర్‌లో ద్వితీయ భాషగా ఉర్దూను ఎంచుకుంది. ఉర్దూ భాషను మిత్రులతో పాటు యూట్యూబ్ సాయంతో నేర్చుకున్నట్లు మౌనిక తెలిపారు. బీఏ లిటరేచర్ ఉర్దూలో చేస్తున్నట్లు వివరించారు. ప్రతిసారి ఉర్దూ మాధ్యమంలో రిజర్వేషన్ కేటగిరి పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోతున్నాయి. ఈ విషయం తెలిసిన వసంత్‌రావు తన కూతురు మౌనికను ఉర్దూ భాష లిపిని నేర్చుకోవాలని ప్రోత్సహించారు. ఫలితంగా ఆ యువతి ఉద్యోగం సాధించగలిగింది. ఎంపికైన మరో అభ్యర్థి రాఠోడ్ ఆర్థిక స్వయాన మౌనికకు చిన్నమ్మ కావడం మరో విశేషం. వీరిద్దరూ ఉర్దూ మాధ్యమంలో పాఠాలు బోధించనున్న తొలి గిరిజన తెగ అభ్యర్థులుగా చరిత్ర సృష్టించనున్నారు.

ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై ఆరోపణల కలకలం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై పలు ఆరోపణలతో కూడిన కరపత్రం గురువారం ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పేరిట విడుదలవడం కలకలం సృష్టించింది. ఆ కరపత్రం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌తోపాటు ఆర్జీయూకేటీ ఉపకులపతిగా కొనసాగుతూ, పేద విద్యార్థులకు చెందాల్సిన డబ్బులు కాజేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులుగా రూ.లక్షల జీతం ఇస్తూ అక్రమాలకు తెరలేపారన్నారు. ఆర్జీయూకేటీలో విద్యార్థులు, మహిళా ఉద్యోగులను వేధించడం, అప్పుడప్పుడూ ఇక్కడికి వస్తూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డబ్బులు దండుకున్నాడన్నారు. చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి, భోజనశాలల నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఉపకులపతిని చరవాణిలో సంప్రదించగా తాను దీనిపై ఏమి మాట్లాడనని తెలిపారు.

శైలపుత్రి నమోస్తుతే..




శైలపుత్రిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా గురువారం బాసర అమ్మవారు శైలపుత్రి అవతారంలో దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం, వ్యాసమహర్షికి పూజలు చేసి ఘటస్థాపనకు అవసరమైన నీటిని తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఘటస్థాపన పూజలో ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆలయ ఈఓ విజయరామారావు, ఆలయ ఛైర్మన్ శరత్‌పాఠక్‌లు పాల్గొన్నారు. నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసాలు చేయించారు. బాసర మాజీ సర్పంచి దయాల లక్ష్మణ్‌రావు తులం బంగారంతో అమ్మవారికి తయారు చేయించిన ముక్కు పుడకను ఆలయ ఈఓకు అందజేశారు.



ఘట స్థాపన చేస్తున్న ఆలయ వేద పండితులు, ఈఓ విజయరామారావు



ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రదర్శనలో అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలు

బెల్లంపల్లిలో అష్టాదశ శక్తి పీఠాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాల్లో వెలసిన అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఇది అందరికీ సాధ్యం కాదు. శక్తి పీఠాలను దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాంటి శక్తి పీఠాలను బెల్లంపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. అమ్మవార్ల శక్తి పీఠాల విగ్రహాల వద్ద మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయడంతో వాటి స్వరూపం అచ్చంగా అక్కడికి వెళ్లి దర్శించుకున్న అనుభూతి కలుగుతుంది. దుర్గాదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి పీఠాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది.

నిషేధిత మత్తుపదార్థం స్వాధీనం

● సరకు విలువ రూ.43 లక్షలు



పట్టుకున్న అల్ఫాజోలం, క్లోరల్‌హైడ్రేట్ సంచులతో ఆబ్కారీ అధికారులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నిల్వ చేసిన కల్తీ కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాన్ని(క్లోరల్ హైడ్రేట్) ఆబ్కారీశాఖ రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో గురువారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 728 కిలోల సీహెచ్‌ను ఇక్కడ నిల్వ ఉంచారు. ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం సోదాలు చేపట్టగా ఈ విషయం బయటపడింది. స్థానిక ద్వారకానగర్‌లో ఉండే శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో అల్ఫాజోలం నిల్వ చేశాడనే పక్కా సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అతడి వద్ద 3.3 కిలోల అల్ఫాజోలం లభించింది. లోతుగా విచారించగా శాంతినగర్‌లోని ఓ గోదాంలో సీహెచ్ నిల్వ చేసినట్లు అంగీకరించాడు. అక్కడికి చేరుకున్న అధికారులు సీహెచ్ బస్తాలను స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించారు. ఈ మొత్తం విలువ రూ. 43 లక్షలు ఉంటుందని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృంద పర్యవేక్షకుడు ప్రదీప్‌రావు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు, పీడీ యాక్ట్ నమోదైనట్లు ఆయన వివరించారు. తాజా ఘటనలో అతడిపై మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఇది సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, అసలు సూత్రధారులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఆటల్లో మేటి.. సత్తా చాటి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఏడాదిలో చివరి నాలుగు నెలలు క్రీడా మాసంగా చెప్పొచ్చు. ఎస్‌జీఎఫ్‌తో పాటు వివిధ క్రీడా అసోసియేషన్లు ఈ రోజుల్లోనే పోటీల నిర్వహణ చేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ ఇలా అన్ని స్థాయిల్లో ఈ 120 రోజుల్లోనే జరుగుతుంటాయి. ప్రతిభ ఉన్న క్రీడాకారులు బయటికొచ్చేదీ.. వారి భవిష్యత్తును బంగారు బాటవేసుకునే అవకాశం ఇప్పుడే కావడం విశేషం. ఈ సంవత్సరం గత రెండు నెలలుగా ఎస్‌జీఎఫ్, అసోసియేషన్లు జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు పోటాపోటీగా నిర్వహిస్తోంది. ఆయా విభాగాల్లోని క్రీడాకారులు మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీలకు అర్హత పొందుతున్నారు. ఇటీవల జరిగిన పలు పోటీల్లో సత్తా చాటి.. ఉన్నతస్థాయికి చేరుకున్న పలువురిపై 'న్యూస్‌టుడే' కథనం.



ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు

రాకెట్‌తో.. ర్యాంకులకు పోటీ



మంచిర్యాల జిల్లాకు చెందిన అనన్య.. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బ్యాడ్మింటన్‌పై ఆసక్తితో కొంతకాలం జిల్లా కేంద్రంలోనే శిక్షణ పొందగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తోంది. రాకెట్‌తో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. పాఠశాల క్రీడా సమాఖ్య తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంది. అండర్-15 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో 8, జాతీయస్థాయిలో 30వ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న ఆలిండియా ర్యాంకింగ్ పోటీల్లో మరింత మెరుగైన స్థానం కోసం పోటీపడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో పీఎన్బీ మెట్‌లైఫ్ జేబీసీ రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

హ్యాండ్‌బాల్‌లో జాతీయస్థాయికి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సిర్పూర్-టి) పదో తరగతి విద్యార్థి దుర్గం యోగి హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటుతున్నాడు. జట్టులో నాలుగో సభ్యుడిగా మెరుగైన ప్రదర్శన ఇస్తూ ఆకట్టుకున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబరిచాడు. ఉమ్మడి జిల్లా జట్టు మొదటిస్థానం కైవసం చేసుకోవడంలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇప్పటికే నాలుగుసార్లు ఎంపిక కాగా తొలిసారి జాతీయస్థాయిలో చోటు సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో తన ప్రతిభను పరీక్షించుకుంటున్నాడు.

మొదటిసారి.. మెరుగైన స్థాయి

కౌటాల మండలానికి చెందిన కార్తీక్.. మొదటిసారి రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హ్యాండ్‌బాల్ జట్టులో మూడో సభ్యుడిగా సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో అభ్యసిస్తున్న కార్తీక్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకపాత్ర పోషించాడు. అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ ఏర్పాటు చేసిన పలు పోటీల్లో ప్రతిభ చాటాడు. రాష్ట్రస్థాయి ధ్రువీకరణపత్రాలు సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయికి చేరి అదే ఆటతీరుతో మరింత ఉన్నతస్థానానికి చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు.



యోగా.. చేస్తాడు బాగా

మంచిర్యాల జిల్లా బొక్కలగుట్టకు చెందిన రాహుల్.. యోగాసనాల్లో దిట్ట. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యోగాపై మక్కువతో ఆరేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఒళ్లును విల్లులా చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. జిల్లా పోటీల్లో సాధించిన పతకాలకు లెక్కే లేకపోగా రాష్ట్రస్థాయిలోనూ అదేతీరును కనబరుస్తున్నాడు. రెండుసార్లు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లోనూ కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకోగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆసనాలతో ఆకట్టుకుని నాలుగోసారి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు.



ఆసనాలతో ఔరా అనిపించేలా..



హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన వైష్ణవి యోగాలో ప్రతిభచాటుతోంది. గత నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటుండగా మొదటిసారి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గతంలో ఒకసారి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. జాతీయస్థాయికి తొలిసారి చేరగా ఆసనాలతో ఆకట్టుకుని పతకం సాధించేందుకు సిద్ధమవుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మంచిర్యాల: 98663 07290
చెన్నూరు: 98496 20143
బెల్లంపల్లి: 99496 20369

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:

? తాళ్లగురజాలకు వెళ్లే రోడ్డులో పట్టణం నుంచి తీసుకువచ్చిన చెత్త చెదారాన్ని రోడ్డు పక్కనే వేస్తున్నారు. **- తిరుపతి, బెల్లంపల్లిబస్తీ**

సమాధానం : డంపింగ్ యార్డుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు చేపడతాం. **- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్**

ప్రశ్న : కన్నాలబస్తీ కొత్తబస్టాండ్ నుంచి కాంటాచౌరస్తా వరకు కొంత మంది బైక్ రైడింగ్ చేస్తూ అధిక శబ్దాలతో వెళుతున్నారు. **- రామకృష్ణ, బజార్‌ఏరియా**

సమాధానం : పట్టణంలోని బజార్‌ఏరియాలో ద్విచక్రవాహనాలను అతి వేగంగా నడిపే వారిపై కేసులు నమోదు చేస్తాం. **- దేవయ్య, ఒకటో పట్టణ ఎస్‌హెచ్‌ఓ**

సరస్‌ఫేర్ మేళాకు సెర్ప్ ప్రతినిధులు

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : సెర్ప్ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధానిలోని పీపుల్స్‌ప్లాజాలో నిర్వహిస్తున్న సరస్‌ఫేర్-2024 మేళాలో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 80 మంది డ్వాక్రా సంఘాల ప్రతినిధులు గురువారం ప్రత్యేక బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ బస్సును జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు నైపుణ్యంతో తయారు చేసిన ఉత్పత్తులను మేళాలో ప్రదర్శిస్తుండగా వాటిని పరిశీలించి మంచిర్యాల జిల్లాలోనూ ఉత్పత్తులు చేసేలా అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మహిళలను పంపించినట్లు డీఆర్డీవో కిషన్ తెలిపారు. డీపీఎంలు, ఏపీఎంలు, సెర్ప్ అధికారులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్

సమాచారం లేకుండా ఎలా కూల్చేస్తారు? భాజపా

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : వ్యాపారస్తులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలు చేపడుతుందని భాజపా జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మండిపడ్డారు. వ్యాపార సముదాయంలో కూల్చివేసిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఎలాంటి సమాచారం లేకుండా రాత్రికి రాత్రే హద్దులు గీసి కూల్చివేయడం సరికాదన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పండుగలపూట ఇలాంటి చర్యలకు పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదని, ఇలా వ్యవహరించడంపై ప్రతిపక్షాలతో పాటు ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. అక్రమ నిర్మాణాలు ఉంటే విధివిధానాలతో ముందుకెళ్లాలి తప్పితే ఇష్టారీతిన ప్రవర్తించడంతో మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ఈ కూల్చివేతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్‌జైన్, అధికార ప్రతినిధి రాకేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కూల్చివేతల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రఘునాథ్, భాజపా నాయకులు


గుడిపేట పటాలంలో అమ్మవారి విగ్రహం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్న కమాండెంట్ వెంకటరాములు


చెన్నూరు బలిజవాడలో అమ్మవారి విగ్రహంతో భక్తుల శోభాయాత్ర


కోటపల్లిలో..

దేవీశరన్నవరాత్రులు ప్రారంభం


సుద్దాలలో..

లక్సెట్టిపేట, చెన్నూరు గ్రామీణం, హాజీపూర్, కోటపల్లి, చెన్నూరు, శ్రీరాంపూర్ గ్రామీణం, రామకృష్ణాపూర్, నెన్నెల, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు సాగనున్నాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.


లక్షెట్టిపేటలోని గోదావరి రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం


ఆసుపత్రి భవనం నమూనాతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మాతాశిశు భవనం నిర్మాణంతో జన్మ సార్థకం

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : పేదలకు మెరుగైన వైద్యంతో పాటు మాతాశిశు సంరక్షణ భవనం నిర్మాణంతో తన జన్మ సార్థకమవుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐబీ ప్రాంతంలో సూపర్‌స్పెషాలిటీ, మాతాశిశు సంరక్షణ ఆసుపత్రి భవనాల ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గతంలో [illegible] నిర్మించిన సమీకృత కూరగాయలు, మాంసాహారం మార్కెట్ భవనాల కూల్చివేత పనులను ఆయన ప్రారంభించారు. త్వరలో రాళ్లవాగు నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు కరకట్ట నిర్మాణాన్ని ప్రారంభిస్తామన్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో మృతదేహాలను ఖననం చేయడానికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు రూ.4 కోట్లతో వైకుంఠధామం నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన చేశారు.

లోటుపాట్లు లేకుండా సర్వే చేపట్టాలి

కాసిపేట, న్యూస్‌టుడే : కుటుంబ నిర్ధారణ (డిజిటల్) సర్వేలో లోటుపాట్లు లేకుండా సర్వే చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులున్నా ఉన్నతాధికారుల సూచనలు తీసుకోవాలని పాలనాధికారి కుమార్ దీపక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి అమలు చేసే డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా మండలంలోని లంబాడి తండా(కె) గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గురువారం గ్రామంలో అధికారులు చేపడుతున్న సర్వేను పాలనాధికారి తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి సమాచారం నమోదు చేయాలన్నారు. ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో సత్యనారాయణసంగ్, ఇన్‌ఛార్జి డీఎల్‌పీవో సఫ్థర్ అలీ, కార్యదర్శులు తదితరులున్నారు.

దండేపల్లి గ్రామీణం : పైలటు ప్రాజెక్టుగా దండేపల్లి మండలం అల్లీపూర్ గ్రామ పంచాయతీ ఎంపికైంది. గురువారం ఆర్డీఓ రాములు కార్డుల కోసం ఇంటింటి సర్వే ప్రారంభించారు. ట్రైకార్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి పరిశీలించారు.

చెన్నూరు : కుటుంబ కార్డు సర్వే ప్రక్రియలో భాగంగా పట్టణంలోని 5వ వార్డును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. పురపాలిక కమిషనర్ గంగాధర్, వార్డు కౌన్సిలర్ నసీమాబేగంతో పాటు సర్వే బృందం ఆ వార్డులో ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు.


లంబాడి తండా (కే)లో సర్వేను పరిశీలిస్తున్న పాలనాధికారి కుమార్ దీపక్

బెల్లంపల్లి అభివృద్ధికి చొరవ తీసుకుంటా: ఎమ్మెల్యే

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం కన్నాల పంచాయతీలోని శ్రీబుగ్గరాజరాజేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆలయానికి సరైన రవాణా సౌకర్యం కల్పించడానికి రూ.3 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి సుమారుగా 1500 ఇళ్లను కేటాయిస్తున్నట్లు, అర్హులైన పేదలకు తప్పకుండా మంజూరు చేస్తామన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. రహదారిని మహాశివరాత్రి వరకు పూర్తిచేయాలని గుత్తేదారుకు సూచించారు. జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్, ఆర్డీవో హరికృష్ణ, బెల్లంపల్లి పురఛైర్‌పర్సన్ జక్కుల శ్వేత తదితరులు పాల్గొన్నారు.


కన్నాల బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్, తదితరులు

కన్నెపల్లి: మారుమూల మండలాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో 1.43 లక్షలతో నూతనంగా నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భూమి పూజ చేశారు. జిల్లా వైద్యాధికారి హరీష్ రాజ్, ఎంపీడీఓ గంగమోహన్ పాల్గొన్నారు.

భూ యజమానుల కన్నీరు

మండల కేంద్రానికి చెందిన గోమాస శంకర్, మల్లేష్‌లకు అయిదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. తమకు పట్టా లేకపోవడంతో అధికారులు ఎకరం భూమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కేటాయించారు. గురువారం ఆరోగ్య కేంద్రం భూమి పూజ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే వినోద్‌కు తమ సమస్య చెప్పి కన్నీరు పెట్టుకున్నారు. మిగతా నాలుగు ఎకరాల భూమిని పట్టా చేసేలా చూడాలని కోరారు. జిల్లా పాలనాధికారితో మాట్లాడి తగు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు

జన్నారం, న్యూస్‌టుడే : మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాయమల్లు బతుకుదెరువు కోసం ఇరాక్ వెళ్లాడు. నెలన్నరక్రితం అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతదేహం స్వగ్రామానికి రాకపోవడంతో రాయమల్లు కుటుంబ సభ్యులు ఏడుస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో భాజపా ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అజ్మీర బద్రినాయక్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య, పలువురు భాజపా నాయకులు గురువారం ఆదిలాబాద్ వెళ్లి ఎంపీ నగేశ్‌ను కలిసి సమస్యను వివరించారు. స్పందించిన ఆయన వెంటనే దిల్లీలోని రాయబార కార్యాలయ అధికారులతో చరవాణిలో మాట్లాడి రాయమల్లు మృతదేహం స్వదేశానికి రప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాయబార కార్యాలయ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు భాజపా నాయకులు తెలిపారు.

వన మహోత్సవంలో భాగస్వాములు కావాలి

హాజీపూర్, న్యూస్‌టుడే : వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ అన్నారు. గురువారం హాజీపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

శనిక్కుంట మత్తడి ధ్వంసం కేసులో మరో ఏడుగురి రిమాండ్

చెన్నూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని శనిక్కుంట చెరువు మత్తడి ధ్వంసం కేసులో పోలీసులు గురువారం మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత నెల 16న పేలుడు పదార్థాలతో మత్తడిని ధ్వంసం చేసిన ఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. శనిక్కుంటను ఆనుకొని ఉన్న 15.20 ఎకరాల భూమిని పట్టణానికి చెందిన మంచాల రాజబాపు, నడిపెల్లి లక్ష్మణ్‌రావు, లక్కం రాజబాపు, రాంలాల్‌గిల్డా, బత్తుల సమ్మయ్య, పెద్దింటి శ్రీనివాస్, పోగుల శేఖర్, ఎన్నం బానయ్య, ఇప్ప సంపత్, ఉమేశ్‌గిల్డా అనే వ్యక్తులు సమూహంగా గోదావరిఖనికి చెందిన బుచ్చిరెడ్డి అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. అతడి వద్ద కొనుగోలు చేసిన భూమిని ఫిబ్రవరి 25 2022లో పట్టణానికి చెందిన గొడిశెల బాపురెడ్డి అనే వ్యక్తికి రూ.7.50 కోట్లకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాపురెడ్డి విక్రయదారులకు రూ.4 కోట్లు చెల్లించారు. మొత్తం భూమిలో 4.20 ఎకరాలు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా మిగతా 11 ఎకరాల భూమి చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో ఉండటంతో రిజిస్ట్రేషన్ కాలేదు. ఈ క్రమంలో క్రయవిక్రయదారుల మధ్య తరచూ వివాదం చోటు చేసుకునేది. వర్షాకాలంలో చెరువు నిండి భూమిలోకి నీళ్లు వస్తుండటంతో భూవిక్రయదారులు అందులో మట్టిని పోయించారు. దీంతో చెరువు వైపు ఎత్తుపెరిగి నీళ్లు సమీపంలోని కాలనీలోకి చేరుతుండటంతో ముంపు సమస్య ఏర్పడింది. ఎలాగైనా భూమిని కాపాడుకోవాలనే ప్రయత్నంలో భాగంగా విక్రయదారులంతా కలిసి చట్టవిరుద్ధంగా దానికి నాలాకన్వర్షన్ కూడా చేయించారు. ఏటా వర్షాలకు భూమిలోకి నీళ్లు చేరుతుండటంతో తనకు భూమి వద్దని, తాను చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని బాపురెడ్డి విక్రయదారులను ఒత్తిడి చేశారు. దీంతో విక్రయదారులు ఎలాగైనా ఈ ఇబ్బందుల నుంచి బయటపడాలన్న ఆలోచనతో మత్తడిని ధ్వంసం చేయాలని వ్యూహం పన్నారు. విక్రయదారుల్లో ఒకరైన బత్తుల సమ్మయ్య ఆధ్వర్యంలో విక్రయదారులంతా ముంపునకు గురవుతున్న కాలనీకి చెందిన వార్డు కౌన్సిలర్ పెండ్యాల స్వర్ణలత భర్త పెండ్యాల లక్ష్మినారాయణ, స్థానికుడు భీం మధుకర్‌లను సంప్రదించి మత్తడిని ధ్వంసం చేసేందుకు రూ.4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. మత్తడిని ధ్వంసం చేశారు. భూవిక్రయదారులైన పదిమంది నేరాన్ని ప్రోత్సహించినట్లు రుజువుకావడంతో వారందరిపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ వివరించారు. పరారీలో ఉన్న ముగ్గురు వ్యక్తుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు తెలిపారు.


కేసు వివరాలను వెల్లడిస్తున్న మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్సై శ్వేత

సంక్షిప్తం

పీజీ సీట్ల వెబ్ ఆప్షన్లకు నేడే ఆఖరు

బెల్లంపల్లి పట్టణం : బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ సీట్ల వెబ్ ఆప్షన్‌కు ఈ నెల 4వ తేదీ తుది గడువని ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్, పీజీ కో ఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బెల్లంపల్లి డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ(ఇంగ్లిష్), ఎం.కాం కోర్సుల్లో రెండో విడతలో ఆప్షన్ కోసం అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం

బెల్లంపల్లి పట్టణం : పట్టణంలోని తిలక్ క్రీడామైదానంలో దసరా రోజు నిర్వహించే రామ్‌లీల కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ.లక్ష విరాళాన్ని గురువారం హిందూ ఉత్సవ సమితికి అందజేశారు.

కార్యకర్తలే భాజపాకు బలం

నస్పూర్ : కార్యకర్తలే భాజపాకు బలం అని జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పేర్కొన్నారు. గురువారం పురపాలికలోని 1వ వార్డులో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనివాస్, సదయ్య, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

నెన్నెల : గ్రామ పంచాయతీలో మిషన్ భగీరథ పథకంలో మంచినీటిని సరఫరా చేసే సహాయకులకు గురువారం శిక్షణ నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, పలు గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

డీజే యజమాని బైండోవర్

తాండూరు : తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో బతుకమ్మ, దసరా పండగలను నిర్వహించుకోవాలని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. బతుకమ్మ వేడుకలకు సైతం డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. రాత్రి 10గంటల లోపే బతుకమ్మ ఆటపాటలను ముగించుకోవాలని సూచించారు. ఆంక్షలు పాటించకుండా డీజేను వినియోగించిన యజమానిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రామకృష్ణాపూర్ : రామకృష్ణాపూర్ పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక మానవతా విలువల శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. గురువారం కార్యక్రమానికి హాజరైన ఆయన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.

ముగిసిన క్రీడా పోటీలు

హాజీపూర్: మండలంలోని గుడిపేట పోలీసు పటాలంలో శిక్షణ పోలీసులకు నాలుగురోజులగా నిర్వహిస్తున్న క్రీడల పోటీలు గురువారం ముగిసాయి. పరుగుపందెం, టగ్ ఆఫ్ వార్, లాంగ్ జంప్, హైజంప్, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు పటాలం కమాండెంట్ వెంకటరాములు బహుమతులను అందజేశారు.

మద్యం దుకాణంపై చర్యలు

మంచిర్యాలనేరవిభాగం: కల్తీ మద్యం విక్రయిస్తున్న పట్టణంలోని ఓ మద్యం దుకాణంపై ఆబ్కారీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆరిజిన్ డైరీ సీఏవో బోడపాటి షేజల్ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రూ.25 వేల మద్యం కొనుగోలు చేసిన తనకు సంబంధిత దుకాణంలో కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

చర్లపల్లిని పంచాయతీ ఏర్పాటుకు వినతి

జన్నారం : దేవునిగూడ గ్రామపంచాయతీలోని చర్లపల్లి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్థులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీడీఓ శశికళకు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు.

వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

చెన్నూరు: వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని అటవీశాఖ చెన్నూరు డిప్యూటీ రేంజి అధికారి ప్రభాకర్ అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం చెన్నూరు పట్టణంలో ఆశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అష్టాదశ శక్తి పీఠాల ప్రదర్శన ప్రారంభం

బెల్లంపల్లి పట్టణం : వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అష్టాదశ శక్తి పీఠాలను గురువారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో శక్తి పీఠాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 13వ వార్డులో బతుకమ్మ చీరలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్‌తో కలిసి అందజేశారు.

అంగవైకల్యం ఉందని బాధపడొద్దు

కాసిపేట : అంగవైకల్యం ఉందని నిరాశ చెందకూడదని, ప్రయత్నం చేస్తే విజయం సాధిస్తారని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్ అంగవైకల్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే ఉచితంగా చక్రాల కుర్చీని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.

సీసీ కెమెరాల ప్రారంభం

జైపూర్ : నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని శ్రీరాంపూర్ సీఐ మోహన్, జైపూర్ ఎస్సై శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 6 సీసీ కెమెరాలను వారు ప్రారంభించారు.

విద్యార్థులు తోడ్పాటు అందించాలి

కాసిపేట: వన్యప్రాణుల పరిరక్షణకు విద్యార్థుల తోడ్పాటు అవసరమని డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించారు.

రాగి తీగ చోరీ నిందితుల అరెస్టు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు దుకాణంలో రాగి తీగ చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ గురువారం సుల్తానాబాద్ ఠాణాలో వివరాలు వెల్లడించారు. శాస్త్రీనగర్‌లోని నరేందర్‌రెడ్డికి చెందిన దుకాణంలో సెప్టెంబరు 23న అర్ధరాత్రి దొంగలు చొరబడి 300 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మందమర్రికి చెందిన గుర్రాల చిన్నభూమయ్య, పిట్టల సురేందర్, సిలివేరి శంకరయ్య, కడమండ శ్రీకాంత్, బెల్లంపల్లికి చెందిన గోషిక కార్తీక్‌లు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన రాగిని ఆటోలో బెల్లంపల్లికి తరలించి పసుపులేటి శ్రీనివాస్‌కు 250 కిలోలు అమ్మి రూ.లక్ష తీసుకొని పంచుకున్నారు. 50 కిలోల రాగిని చిన్నభూమయ్య తన వద్దే ఉంచుకున్నాడు. వ్యాపారి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 250 కిలోల రాగి నుంచి 50 కిలోలను హైదరాబాద్‌కు చెందిన రాముకు విక్రయించాడు. నిందితులు సురేందర్, శంకరయ్య, శ్రీకాంత్, కార్తీక్, శ్రీనివాస్‌లను గురువారం అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్రవాహనం, 200 కిలోల రాగిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గుర్రాల చిన్నభూమయ్య, హైదరాబాద్‌కు చెందిన రాము పరారీలో ఉన్నారు.

విద్యుదాఘాతంతో గాయాలు

భీమిని: స్తంభాలకు వీధి దీపాలు అమర్చుతుండగా ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపూర్‌కి చెందిన చిలుముల రాజ్‌కుమార్ గురువారం ఎల్‌సీ తీసుకోకుండా స్థానికంగా ఉన్న మినీ నియంత్రిక నుంచి విద్యుత్తు సరఫరా కాకుండా ఫ్యూజు తీసి, సరఫరా నిలిపివేసి పంచాయతీ కార్మికుడితో కలిసి వీధి దీపాలు అమర్చుతున్నాడు. కొన్ని స్తంభాలకు విద్యుత్తు దీపాలు అమర్చారు. వాటి తర్వాత ఉన్న స్తంభానికి విద్యుత్తు దీపం అమర్చుతుండగా పైన ఉన్న 11కేవీ తీగలో విద్యుత్తు సరఫరా ఉండటంతో విద్యుదాఘాతానికి గురై ఇంటి రేకులపై పడ్డాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు విద్యుత్తు దీపం స్తంభానికి అమర్చితే రూ.50 తీసుకొని అమర్చుతున్నట్లు తెలిసింది.

సమీకృత వ్యవసాయంతో ఆదాయం

బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : రైతులు అవలంబించే సమీకృత వ్యవసాయ పద్ధతులతోనే నికర ఆదాయం వస్తుందని బెల్లంపల్లి కేవీకే అధిపతి శివకృష్ణ అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి గ్రామంలో జగిత్యాల వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఆదాయం పెంచుకోవడానికి మిశ్రమ పంటలు, పాడి పరిశ్రమలు, కోళ్ల, జీవాల పెంపకం చేపట్టాలన్నారు. ఎరువుల యాజమాన్యం, సేంద్రియ పద్ధతులు పాటించాలన్నారు. గ్రామంలోని వ్యవసాయ భూములు, రైతులు సాగుచేస్తున్న పంటల ప్రదర్శన చేపట్టారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే శాస్త్రవేత్తలు, విద్యార్థులు, రైతులు

ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు లేదా..?


నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద ఏర్పాటు చేయని ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు. వర్షం పడితే దారంతా బురదమయం కావడం, దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు.

క్యాతనపల్లి రైల్వే గేటు వద్ద ఏళ్లుగా కొనసాగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డుతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డుకు ఓ వైపు నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ అక్కడ ఎలాంటి ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈఈ హరీష్‌ను వివరణ కోరగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, రామకృష్ణాపూర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో యువకుల దుర్మరణం

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే : మందమర్రి యాపల్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంటెంకి రాజేష్ (20) యువకుడు మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. భీమారం మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన రాజేష్ తన స్నేహితుడు నాగరాజుతో కలిసి బోయపల్లికి వెళ్లాడు. పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న రాజేష్‌కు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి పోశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోటపల్లిలో..

కోటపల్లి : శంకరాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటపల్లి గ్రామానికి చెందిన తైదల సాగర్ (28) మృతిచెందాడు. గురువారం పని నిమిత్తం వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో సాగర్‌కు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చెన్నూరుకు అనంతరం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్యతో పాటు తల్లి ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.


సాగర్

చికిత్స పొందుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి


రాజశేఖర్

నస్పూర్, న్యూస్‌టుడే : పురపాలికలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి మండలం గుడిపెల్లికి చెందిన మాస్ రాజశేఖర్(32) స్వచ్ఛ వాహన చోదకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు అతడ్ని రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే : బొక్కలగుట్ట గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరిపి అక్రమంగా సరఫరా చేస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు మందమర్రి తహసీల్దారు సతీష్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్లను రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

భీమారం, న్యూస్‌టుడే : భీమారంలో కొంతకాలంగా అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో అక్రమ మట్టి తవ్వకాలు చేపడుతున్నారని తహసీల్దారు సదానందం ఫిర్యాదు మేరకు జేసీబీ, రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. యజమానులైన పున్నం, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హాజీపూర్, న్యూస్‌టుడే : మంచిర్యాల పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్ నుంచి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం హాజీపూర్‌లో పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాలకు చెందిన తూర్పాటి చంటి ఆటోలో 150 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిఖని: పట్టణంలోని గంగానగర్, అడ్డగుంటపల్లి ప్రాంతాల్లో 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖనికి చెందిన విక్రమ్‌తోపాటు మంచిర్యాలకు చెందిన ప్రకాశ్, చిన్నలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు అపహరణ

జన్నారం, న్యూస్‌టుడే : మండలంలోని దేవునిగూడ గ్రామంలో ఓ మహిళ మెడలో నుంచి రెండు తులాల పుస్తెలతాడును గురువారం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనం మీద వచ్చి లాక్కెళ్లాడు. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకింది రమా దేవునిగూడ గ్రామంలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. సీసీ ఫుటేజీలను పరిశీలించామని నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని జన్నారం ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

జూదం ఆడుతూ పట్టుబడితే కఠిన శిక్ష

కోటపల్లి, న్యూస్‌టుడే : జూదం ఆడుతూ పట్టుబడితే ఏడు సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించనున్నట్లు చెన్నూరు గ్రామీణ సీఐ సుధాకర్, ఎస్సై రాజేందర్ తెలిపారు. కోటపల్లి మండలం శంకరాపూర్‌లో బుధవారం జూదం ఆడుతూ పట్టుబడిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఒక్కొక్కరికి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

నస్పూర్, న్యూస్‌టుడే : జల్సాలకు అలవాటు పడి ఖర్చుల కోసం గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సుగుణాకర్ కథనం మేరకు.. నస్పూర్‌కు చెందిన గోదారి రాజు, జాడి వంశీ, మంచిర్యాలకు చెందిన సాయికుమార్‌లతో పాటు మరో నలుగురు స్నేహితులు భద్రాచలం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనేవారు. ఇక్కడికి తీసుకొచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బుధవారం రాత్రి తీగల్‌పహాడ్ శివారులో భద్రాచలం నుంచి తీసుకొచ్చి గంజాయిని పంచుకోవడానికి ఏడుగురు కలుసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేయగా గోదారి రాజు, జాడి వంశీ, సాయి కుమార్‌లను అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద 1.5 కిలోల గంజాయి, 2 చరవాణులు స్వాధీనం చేసుకొని నిందితులకు రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.